'ఉద్యోగులు, అధికారులకు అండగా ఉంటా'



కమిషనర్ హరితను కలిసిన శ్రీనివాస్‌రెడ్డి, దేవేందర్ తదితరులు

అబిడ్స్: ఉద్యోగులు, అధికారులకు అండగా ఉంటానని వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ హరిత అన్నారు. మంగళవారం తెలంగాణ కమర్షియల్ ట్యాక్సెస్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దేవేందర్‌ల ఆధ్వర్యంలో పలువురు నాయకులు కమిషనర్ హరితను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి, దేవేందర్ మాట్లాడుతూ..ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కృషి చేయాలని కోరారు. కమిషనర్ హరిత సానుకూలంగా స్పందించారు.

సన్మానం



చార్మినార్: వరల్డ్ రెస్లింగ్ చాంపియన్, ఇటీవల జాతీయ స్థాయిలో జరిగిన కుస్తీ పోటీల్లో బ్రాంజ్ మెడల్ సాధించిన అభిమన్యు యాదవ్‌తో పాటు బేలా ముత్యాలమ్మ ఆలయ కమిటీ అధ్యక్షులు పాటేల్ సదానంద్ యాదవ్ తదితరుల బృందం హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయను కలిసి కుస్తీ పోటీల వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. కుస్తీ పోటీల్లో కాంస్య పతకం సాధించిన పాతబస్తీకి చెందిన అభిమన్యు యాదవ్‌ను గవర్నర్ బండారు దత్తాత్రేయ అభినందించారు.

మాడభూషి రంగాచార్య స్మారక కథా పురస్కారం ప్రదానం



శ్రీనివాస్‌గౌడ్ దంపతులకు పురస్కారాన్ని అందజేస్తున్న విహారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: ఆదర్శవంతమైన సమాజానికి కావాల్సిన చైతన్యాన్ని తన ధార్మిక దృష్టితో వ్యక్తీకరించిన పుస్తకం 'మార్జినోళ్లు'కథా సంపుటి అని పలువురు వక్తలు అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో డాక్టర్ మాడభూషి రంగాచార్య స్మారక సంఘం ఆధ్వర్యంలో రచయిత పి.శ్రీనివాస్‌గౌడ్‌కు డాక్టర్ మాడభూషి రంగాచార్య స్మారక కథా పురస్కారాన్ని ప్రదానం చేశారు. అదేవిధంగా 'నేటికాలపు నేటి కథకులు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి విహారి మాట్లాడుతూ..కవిత్వంలోనూ, కథా రచనలోనూ సవ్యసాచిత్వం నేర్పుతున్న రచయిత తీరును కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి సుధామ, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాళేశ్వరం శంకరం, నిర్వాహకురాలు మాడభూషి లలితదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను చెల్లించని వారి ఆస్తులు సీజ్



అఫ్జల్‌గంజ్: ఆస్తిపన్ను చెల్లించని భవనాలను జీహెచ్‌ఎంసీ అధికారులు సీజ్ చేశారు. అబిడ్స్ హిందీనగర్ ప్రాంతాల్లో ఒక భవన యజమాని రూ.3,28,326లు, మరో భవన యజమాని రూ.7,54,075లు చెల్లించకపోవడంతో మంగళవారం ఈ భవనాలను అబిడ్స్–14వ సర్కిల్ అధికారులు సీజ్ చేశారు. పాత బకాయిలు చెల్లించని వారిపై జీహెచ్‌ఎంసీ గోషామహల్–14వ సర్కిల్ అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ కైలాష్ సింగ్, వీసీలు సదానంద్, సంజీవ్‌కుమార్ ఈ భవనాలకు రెడ్ నోటీసులు జారీ చేసి సీజ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పాత బకాయిలు వెంటనే చెల్లించాలని లేనిచో ఆస్తులు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



అబిడ్స్: ధూల్‌పేట్ పరిసర ప్రాంతాల్లో ఫుట్‌పాత్ ఆక్రమణలను జీహెచ్‌ఎంసీ 14వ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు మంగళవారం టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారి నరేష్ ఆధ్వర్యంలో తొలగించారు. ధూల్‌పేట్‌తో పాటు గోషామహల్ పరిసర ప్రాంతాల్లో కూడా పలు ఫుట్‌పాత్ ఆక్రమణలను అధికారులు కూల్చివేశారు. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ అధికారి మాట్లాడుతూ..ఎవరైనా ఫుట్‌పాత్‌లను కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



మహంకాళేశ్వర ఆలయంలో శివలింగం

- ముస్తాబైన శివాలయాలు
- అన్ని ఏర్పాట్లు చేసిన ఆలయాల నిర్వాహకులు



ముస్తాబైన మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయం



చార్మినార్‌లోని మహాదేవ్ మందిర ప్రధాన ద్వారం

మహా శివరాత్రికి సర్వం సిద్ధం

చార్మినార్: పాతబస్తీలోని శివాలయాలు మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబయ్యాయి. చార్మినార్, యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట, బహదూర్‌పురా తదితర శాసన సభ నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లోని పురాతన శివాలయాలను నిర్వాహకులు భక్తులకు సౌకర్యవంతంగా తీర్చిదిద్దారు. రోజంతా ఉపవాసం ఉండి శివాలయంలో జరిగే ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని సాయంత్రం ఉపవాసం విడిచే వారికి అన్ని ఏర్పాట్లు చేశారు. రాత్రంగా జాగరణ చేయడం కోసం కూడా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.





శంకర్‌జీ హనుమాన్‌జీ ఆలయ కల్యాణ మండపంలో..

మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో..

మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో మహా శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేశారు. ఈ నెల 26న ఉదయం 4 గంటలకు నిర్వహించే గణపతి పూజతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. శివపార్వతుల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య మాట్లాడుతూ.. భక్తులు సకాలంలో ఆలయం వద్దకు చేరుకుని శివపార్వతుల కల్యాణోత్సవాన్ని కనులారా తిలకించి దర్శనం చేసుకోవాలని ఆయన కోరారు. 26న ఉదయం పుణ్యవచనం, రుద్ర మండలం అవహనం, మహాన్యాస పూర్వక ఏకాదశి మహా రుద్రాభిషేకం, రుద్రహోమం, విశేష్ అలంకరణ, మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలతో పాటు బిల్వార్చన, శివపార్వతి కల్యాణోత్సవం, భజన కార్యక్రమాలు, అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవ అభిషేకం, అర్చన, రాత్రి 12.30 గంటలకు మహా హారతి తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయని గాజుల అంజయ్య తెలిపారు.

చార్మినార్‌లో 1857 నాటి మహాదేవ్ మందిరంలో..

చార్మినార్ సమీపంలోని మహాదేవ్ మందిరంలో ఈసారి మహా శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించడానికి మందిరం నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. 26న నిర్వహించే ఉత్సవాల్లో పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఉత్సవాల నిర్వాహకులు అజయ్‌కుమార్ అగర్వాల్ తెలిపారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 1857 నాటి ఈ మందిరాన్ని 2016లో సరాఫా అండ్ జువెల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధుల సహకారంతో పునఃనిర్మించారు. ఆలయ పునఃనిర్మాణం అనంతరం మహా శివరాత్రి వేడుకలను ప్రతి ఏటా కనుల పండువగా నిర్వహిస్తున్నామన్నారు.

పండ్ల మార్కెట్లు కిటకిట..

చార్మినార్ ప్రధాన రోడ్డులోని పండ్ల మార్కెట్లు వినియోగదారులతో కిటకిటలాడుతున్నాయి. తమకు కావాల్సిన పండ్లు ఖరీదు చేయడానికి భక్తులు ఉత్సాహం చూపుతుండడంతో పండ్ల మార్కెట్‌లు వినియోగదారులతో రద్దీగా మారాయి. దీంతో పాతబస్తీలో ఎక్కడ చూసినా పండుగ సందడి కనిపిస్తోంది. పురానాపూల్, లాల్‌దర్వాజ మోడ్, చాంద్రాయణగుట్ట, బహదూర్‌పురా, కిషన్‌బాగ్, చార్మినార్, మక్కా మసీదు తదితర ప్రాంతాలన్నీ జనం రద్దీతో కళకళలాడుతున్నాయి.

నేడు శివ మహా జాగరణ..

జియాగూడ: శివ మహా జాగరణ మహోత్సవాన్ని బుధవారం రహీంపురా శంకర్‌జీ హనుమాన్‌జీ ఆలయ కల్యాణ మండపంలో మహా శివరాత్రి జాగరణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు సేవా సమితి అధ్యక్షుడు మాడిశెట్టి సదానందం గుప్తా, ప్రధాన కార్యదర్శి ఎస్.రాజన్‌కుమార్, ఆర్గనైసింగ్ కార్యదర్శి పి.రజిత్‌కుమార్, సహ కోశాధికారి టి.సచిన్ రాజ్ సింగ్ తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ..13 ఏళ్ల నుంచి జాగరణ నిర్వహిస్తున్నామన్నారు. మహా శివుడి ప్రత్యేక పూజల అనంతరం మా వైష్ణో దేవి జాగరణ మండల్ ద్వారా ప్రముఖ గాయకులు ఎస్.రాజన్ కుమార్, హరి ఓం మిశ్రా, నిజామాబాద్ గాయకురాలు నిహారిక గీతాలు ఆలపిస్తారన్నారు.

ఉపాధ్యాయ వృత్తిని బాధ్యతగా నిర్వర్తించాలి



శిక్షణ పూర్తిచేసిన డీ-ఎడ్ విద్యార్థులతో డిప్యూటీ ఐఓఎస్ హరి నారాయణ, ఉపాధ్యాయులు

యాకుత్‌పురా: ఉపాధ్యాయ వృత్తిని బాధ్యతగా నిర్వర్తించాలని విద్యాశాఖ బహదూర్‌పురా మండల డిప్యూటీ ఐఓఎస్ హరినారాయణ సూచించారు. డీ-ఎడ్ విద్యార్థులకు నెల రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతుల ముగింపు సందర్భంగా మంగళవారం దారుషిఫా ప్రభుత్వ ప్రత్యేక అంధుల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థులు ఏ రంగంలో రాణించాలన్నా ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఖుద్సియా, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మందడి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు మహేందర్, వెంకటేష్, రాజు, నరసింహులు, నాగరాజు, మహేష్, నరేందర్, శివరాజ్, సదానందం పాల్గొన్నారు.

రంజాన్ మాసం ఎంతో పవిత్రం



మాట్లాడుతున్న కారీ సయ్యద్ మతీన్ అలీషా

గోల్కొండ: రంజాన్ మాసం ప్రతి ముస్లింకు ఎంతో పవిత్రమని ఆల్ ఇండియా ఖీరత్ కమిటీ అధ్యక్షుడు, గోల్కొండ ఈద్గా కతీబ్ సయ్యద్ మతీన్ అలీషా ఖాద్రీ అన్నారు. మంగళవారం గోల్కొండలోని మజీద్ కార్వాలో రంజాన్ మాసం ప్రాధాన్యత, రంజాన్ మాసం స్వాగత కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన రంజాన్ మాసం విశేషాలను వివరించారు. అల్లా కరుణకు అర్హత సాధించాలంటే రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఉంటూ ప్రార్థనలు చేయాలన్నారు. రంజాన్ మాసంలో ప్రతి ఒక్కరూ నిష్టగా దివ్య ఖురాన్ గ్రంథ పఠనం చేయాలని దీన్ని వల్ల నిత్య జీవితంలో చేసే పనులపై ఏకాగ్రత కనబరచవచ్చునన్నారు. కార్యక్రమంలో కార్వా మసీదు ప్రధాన కార్యదర్శి అజీజ్‌ఖాన్ పటాన్, మసూద్ అహ్మద్, మక్కా మసీదు ప్రధాన ఇమామ్ రియాజ్ ఖురేషి, కార్వా మసీదు ఇమామ్ అష్ఫద్ తదితరులున్నారు.

జీహెచ్‌ఎంసీ అబిడ్స్ డిప్యూటీ కమిషనర్‌గా లావణ్య



అబిడ్స్: జీహెచ్‌ఎంసీ అబిడ్స్–14వ సర్కిల్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్‌గా దుబ్బాక లావణ్య పదవీ బాధ్యతలు స్వీకరించారు. గత కొన్ని రోజుల క్రితం ఈ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేసిన విద్యాధర్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న లావణ్యను అబిడ్స్ జీహెచ్‌ఎంసీ మున్సిపల్ ఉప కమిషనర్‌గా నియమించారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన ఆమె మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలో ఆస్తిపన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. 14వ సర్కిల్‌లో రూ.90 కోట్లు ఆస్తిపన్ను టార్గెట్ ఉండగా రూ.50 కోట్ల ఆస్తిపన్ను వసూలు అయ్యిందన్నారు. మిగతా రూ.40 కోట్ల టార్గెట్‌ను మార్చి చివరి వరకు వసూలు చేస్తామన్నారు. పాత ఆస్తిపన్ను బకాయిలు చెల్లించని వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ముందుగా రెడ్ నోటీసులు జారీ చేసి ఆస్తులు కూడా సీజ్ చేస్తామన్నారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్



గౌలిపురా: గౌలిపురాలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల సమీపంలో పైకప్పు లేకుండా నోరు తెరుచుకొని ప్రమాదకరంగా మారింది. దీంతో ఈ దారిలో రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు స్థానిక ప్రజలు అందులో కట్టె, చుట్టూ ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లో ఈ మ్యాన్‌హోల్ కనిపించపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మ్యాన్‌హోల్‌కు మూతలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సామాజిక రుగ్మతలపై పోరాటం



షాబుద్దీన్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న రాజేష్ ఖన్నా

చాంద్రాయణగుట్ట: సామాజిక రుగ్మతలపై పోరాటం చేస్తున్నామని నేషనల్ రైట్స్ మూమెంట్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ జాతీయ చైర్మన్ డాక్టర్ ఎం.పి.రాజేష్ ఖన్నా ఆచారియర్ అన్నారు. అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశం చాంద్రాయణగుట్టలో మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ తెలంగాణ విభాగం చైర్మన్‌గా మహ్మద్ షాబుద్దీన్, వర్కింగ్ టీమ్ గవర్నర్‌గా ఇష్రత్ ఫాతీమాకు నియామకపత్రాలను అందజేశారు. రాజేష్ ఖన్నా మాట్లాడుతూ..అసోసియేషన్ ఆధ్వర్యంలో నేరాల నివారణ, వరకట్న వేధింపులు, అత్యాచార ఘటనలు, మహిళలకు ఆత్మరక్షణ, బాల్యవివాహాలు, మహిళలకు రక్షణపై అవగాహన తదితర అంశాలో పోరాటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జాతీయ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ మహ్మద్ సాహిల్ ఖాన్‌తో పాటు నాగేశ్వరీ, వెంకటేష్, మక్సూద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల పర్యటన



తౌహిద్ మసీదు వెనుక భాగంలో పర్యటిస్తున్న ఏసీపీ సయ్యద్ ఫయాజ్, రాష్ట్ర పురాతత్వ శాఖ అధికారులు

గోల్కొండ: పోలీసులు, రాష్ట్ర పురాతత్వ శాఖ అధికారులు మంగళవారం టూంబ్స్ చౌరస్తా వద్ద గల తౌహిద్ మసీదు వెనుక గల ప్రభుత్వ స్థలంలో పర్యటించారు. ఈ మసీదు వెనుక భాగంలో ఉన్నత స్థలంలో మసీదు కమిటీ వారు నిర్మాణ పనులు ప్రారంభించడంతో గత వారం రాష్ట్ర పురాతత్వ శాఖ వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అనుమతి లేకుండా నిర్మాణం చేపడుతున్నారంటూ పనులను ఆపివేశారు. ఈ విషయంపై స్థల పరిశీలన కోసం పోలీసులు, అధికారులు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్, రాష్ట్ర పురాతత్వ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాములు తదితరులు నిర్మాణ ప్రదేశాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ రాములు స్థలం వివరాలు ఏసీపీకి వివరించారు. పోలీసు కేసు నమోదు అయినందున ఎటువంటి నిర్మాణాలను చేపట్టరాదని ఈ సందర్భంగా ఏసీపీ స్పష్టం చేశారు. ఆయన వెంట ఆగా ఖాన్ ట్రస్ట్ ఫర్ కల్చర్ అధికారి గణేష్‌రెడ్డి తదితరులున్నారు.



ఉత్సాహంగా 'ఫ్యామిలీ బ్లూమ్'

గోల్కొండ: మెహిదీపట్నంలోని శ్రీ చైతన్య పాఠశాలలో మంగళవారం 'ఫ్యామిలీ బ్లూమ్'కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీ చైతన్య పాఠశాల ఏజీఎం బి.కృష్ణ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు నైతిక విలువలు కూడా బోధిస్తున్నామన్నారు. కుటుంబ సభ్యుల ప్రాధాన్యం పిల్లలతో తల్లిదండ్రుల అనుబంధం తదితర విషయాలు నేర్పిస్తామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ తల్లిదండ్రులు, కుటుంబ పెద్దలకు పాదపూజ చేసి వారికి బహుమతులు అందించి వారి ఆశీర్వాదాన్ని పొందారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వాతి, డీన్ మల్లేష్, ఆర్ఐ హరికృష్ణ, ఇన్‌చార్జులు నదీమ్, బాలరాజు, రవి, షగుఫ్త, కో ఆర్డినేటర్ ప్రవీణ్, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గాలయ్యకు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు



సాక్షి, సిటీబ్యూరో: విద్యారంగంలో 35 ఏళ్ల పాటు అపార సేవలు అందించిన తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (టీఆర్‌ఎస్‌ఎంఏ) ఆసిఫ్‌నగర్ మండలి అధ్యక్షుడు, విఘ్నేశ్వర స్కూల్స్ వ్యవస్థాపకుడు బి.గాలయ్యకు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు ప్రదానం చేశారు. జియాగూడలో సోమవారం జరిగిన కార్యక్రమంలో టీఆర్‌ఎస్‌ఎంఏ, అరస్తూ జూనియర్, డిగ్రీ కాలేజీ సంయుక్తంగా ఈ అవార్డును ఆయనకు ప్రదానం చేశాయి. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థుల కోసం ఓరియెంటేషన్ కార్యక్రమం కూడా నిర్వహించారు.

సమస్యలు తలెత్తకుండా చూడాలి



మజ్లిస్ నాయకులకు దిశానిర్దేశం చేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: రంజాన్ మాసంలో సమస్యలు తలెత్తకుండా చూడాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన మజ్లిస్ సీనియర్ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన వారికి వివిధ డివిజన్లలో తీసుకోవాల్సిన చర్యలపై సూచించారు. టోలిచౌకీ డివిజన్‌లోని నదీమ్ కాలనీ, బాల్‌రెడ్డినగర్ కాలనీతో పాటు జమాలికుంట తదితర ప్రాంతాల్లో నీటి సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తేవాలని ఆయన అన్నారు. మసీదుల పరిసరాల్లో మురికి నీరు పారకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు హరూన్‌ఫరాన్, ఆలీముద్దీన్ తదితరులున్నారు.

దృష్టి మరల్చి చోరీలకు పాల్పడుతున్న ముగ్గురి అరెస్ట్

చాంద్రాయణగుట్ట: నగలకు మెరుగులద్దుతామంటూ మహిళల దృష్టి మరల్చి చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగలను దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.4.85 లక్షల విలువైన 57 గ్రాముల రెండు బంగారు గొలుసులను స్వాధీనం చేసుకున్నారు. నగర టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాసారావు తెలిపిన వివరాల ప్రకారం..బిహార్ రాష్ట్రం మెట్‌పల్లికి చెందిన మహ్మద్ సత్తార్ అలీ (45), మహ్మద్ ఆమీర్(38), మహ్మద్ రియాజ్ మాలిక్(42)లు గ్రామాలలో తిరుగుతూ బంగారు ఆభరణాలకు పాలిష్ చేస్తుంటారు. 2018లో తెలంగాణకు వచ్చిన సత్తార్, అమీర్ పాలిష్ చేసే క్రమంలో మహిళల దృష్టి మరల్చి 22 దొంగతనాలకు పాల్పడ్డారు. మార్కెట్ పోలీసులకు చిక్కి పీడీ యాక్ట్‌పై జైలుకు వెళ్లారు. జైలు నుంచి విడుదలైన అనంతరం తిరిగి స్వస్థలానికి వెళ్లారు. ఇటీవలే ఐదు నెలల క్రితం మళ్లీ ఇక్కడికి వచ్చారు. మరో స్నేహితుడు రియాజ్‌ను కలుపుకొని పాత పంథాలోనే చోరీలు చేయాలని పథకం పన్నారు. గత డిసెంబర్‌లో జగిత్యాల జిల్లా కోరుట్లలో రెండు తులాల బంగారు గొలుసు చోరీ చేశారు. అనంతరం హైదరాబాద్‌కు మకాం మార్చిన నిందితులు ఈ నెల 18న ఛత్రినాక ఠాణా పరిధిలోని కాల్వగడ్డ ప్రాంతంలో నగలకు పాలిష్ చేస్తామని యువతి దృష్టి మరల్చి నాలుగు తులాల బంగారు గొలుసుతో ఉడాయించారు. ఈ ఘటనపై ఛత్రినాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. వీరి కదలికలపై విశ్వసనీయ సమాచారం అందుకున్న దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాఘవేంద్ర, ఎస్సైలు ఎస్.నవీన్, ఎం.మహేష్, కె.నర్సింహులు, జి.ఆంజనేయులు, ఛత్రినాక పోలీసులతో కలిసి సంయుక్తంగా నిందితులను అరెస్ట్ చేశారు. తదుపరి విచారణ నిమిత్తం ఛత్రినాక పోలీసులకు నిందితులను అప్పగించారు.